కుదుపు..!

యాక్సిడెంట్ కేసులో పోలీసులు డబ్బుల వసూళ్లపై కలకలం

- వివరాలను సేకరిస్తున్న నిఘా విభాగం అధికారులు
- నేడో రేపో ఉన్నతాధికారులకు అందనున్న నివేదిక
- డబ్బు తిరిగి ఇచ్చేందుకు సిద్ధమైన ఓ అధికారి
- వచ్చి తీసుకెళ్లాలని మీడియేటర్ కు కబురు
- 'అక్షరదర్బార్' కథనం ఎఫెక్ట్

అక్షర దర్బార్, నిఘా విభాగం: ఓ యాక్సిడెంట్ కేసులో పోలీసులు డబ్బు గుంజటాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. లైసెన్స్ లేని డ్రైవర్ స్థానంలో లైసెన్సు కలిగిన డ్రైవర్ పేరును యాక్సిడెంట్ కేసులో చేర్చుతుండటం, ఫలితంగా పోలీసులు డబ్బు తీసుకుంటుండటంపై సీరియస్ అవుతున్నారు. తాజాగా యాక్సిడెంట్ కేసులో డబ్బు గుంజిన పోలీస్ అధికారులు, సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ఓ కుటుంబం కారులో ములుగు జిల్లాలోని ఓ ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా వరంగల్ నగరానికి చేరుకోక ముందే జాతీయ రహదారిపై ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొనటం, ఈ ప్రమాదంలో కారులో ఉన్న ప్రయాణికుల్లో ఓ చిన్నారి మృతి చెందగా కొందరు గాయపడడం, ఈ ఘటనలో ఆ సమయంలో లారీ వెంట ఉన్న డ్రైవర్ కు లైసెన్సు లేకపోవడంతో ఆయన స్థానంలో లైసెన్సు కలిగిన మరో డ్రైవర్ పేరు చేర్చడానికి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల్లో ఇద్దరు లారీ యజమాని నుంచి డబ్బులు గుంజిన వ్యవహారంపై శనివారం 'అక్షర దర్బార్' పత్రికలో 'రైటర్ హర్ట్ సీన్ రివర్స్' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. యాక్సిడెంట్ కేసుల్లో జరుగుతున్న తతంగాన్ని బయటపెట్టిన ఈ కథనం పోలీసు శాఖలోని అక్రమార్కులను కుదిపేసింది. రోడ్డు ప్రమాదం కేసుల్లో కొందరు పోలీస్ అధికారులు, సిబ్బంది డబ్బు వసూలు చేస్తుండటంపై తీవ్ర చర్చ జరిగింది. తమ దృష్టికి రావడంతో ఉన్నతాధికారులు తమ శాఖలోని నిఘా విభాగాల ద్వారా ఈ వ్యవహారంపై నివేదిక తెప్పించుకునే పనిలో ఉన్నట్లు తెలిసింది.

సమాచార సేకరణ

యాక్సిడెంట్ కేసులో సంబంధిత పోలీసు స్టేషన్ అధికారుల్లో ఒకరు రూ.30 వేలు, మరొకరు రూ.12 వేలు లారీ ఓనర్ వద్ద తీసుకున్నారని, స్టేషన్ రైటర్ తీరు వల్ల కేసులో డ్రైవర్ ను మార్చిన విషయం కాస్తా బయటకు వచ్చిందని, దీంతో తిరిగి లైసెన్స్ లేని డ్రైవర్ పైనే కేసు చేశారనేది తమ దృష్టికి రావడంపై పోలీసు ఉన్నతాధికారులు గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై తమ శాఖలోని నిఘా విభాగాల అధికారులకు నివేదిక అందజేయాలని చెప్పినట్లు సమాచారం. దీంతో పోలీసు శాఖలోని నిఘా విభాగం అధికారులు ఈ ఉదంతంపై లోతుగా ఆరా తీస్తున్నారు. ఈక్రమంలో ఓ అధికారి ఈ యాక్సిడెంట్ కేసులోని లారీ డ్రైవర్ కమ్ ఓనర్ తో సోమవారం మాట్లాడినట్లు తెలిసింది. జరిగిందంతా కూడా లారీ డ్రైవర్ కమ్ ఓనర్ నిఘా విభాగం అధికారికి వివరించినట్లు సమాచారం. ఇద్దరు పోలీసు అధికారులకు ఎవరెవరి ద్వారా తాను సమర్పించుకున్న డబ్బు ఎంత? డబ్బు అనేది సదరు అధికారికి చెప్పినట్లు తెలిసింది. ఇంకా ఈ కేసులో చోటు చేసుకున్న పరిణామాలపై సమాచారాన్ని సేకరిస్తున్న నిఘా విభాగం అధికారులు నివేదికను రూపొందించి నేడో రేపు ఉన్నతాధికారులకు అందజేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నివేదిక అందిన తర్వాత ఉన్నతాధికారులు ఈ విషయమై ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది చర్చనీయమైంది.

తిరిగి ఇచ్చేందుకు...

అక్రమ వ్యవహారం బయటకు రావడంతో ఈ యాక్సిడెంట్ కేసులో డబ్బు తీసుకున్న పోలీస్ అధికారుల్లో ఒకరు తాను తీసుకున్న డబ్బు వాపస్ ఇచ్చేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు తనతో ఈ యాక్సిడెంట్ కేసులో మాట్లాడిన మీడియేటర్ కు ఆదివారం కాల్ చేసి తనకు ఇచ్చిన డబ్బు తిరిగి తీసుకెళ్లాల్సిందిగా చెప్పినట్లు సమాచారం. అయితే మీడియేటర్ ఈ విషయాన్ని లారీ యజమానికి చేరవేయగా, తాను ప్రస్తుతం అందుబాటులో లేనని, సోమవారం కలుస్తానని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ముఖ్యంగా ఈ యాక్సిడెంట్ కేసులో జరిగిన పరిణామాలపై స్థానికంగా ఆసక్తికర చర్చ జరుగుతుంది.

22న నర్సంపేటకు కేటీఆర్ రాక..

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ ఈనెల 22న నర్సంపేటలో పర్యటించనున్నారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మద్దతుగా నర్సంపేట పట్టణంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగే పట్టభద్రుల సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించనున్నారు. సమావేశానికి నర్సంపేట నియోజకవర్గంలోని విద్యార్థి, ఉద్యోగ, మేధావి వర్గానికి చెందిన పట్టభద్ర ఓటర్లు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

21 నుంచి జర్నలిస్టులకు క్రీడా పోటీలు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులైన జర్నలిస్టులకు ఆటవిడుపు, ఉల్లాసం కోసం క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్ లు ప్రకటించారు. క్రికెట్, వాలీబాల్ ,క్యారం, చెస్, షటిల్ పోటీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. క్రీడలలో ఆసక్తి ఉన్న జర్నలిస్టులు మంగళవారం నుండి నాలుగురోజుల పాటు (మే 21 నుంచి 24 వరకు) ప్రెస్ క్లబ్ కు నేరుగా వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. అన్ని క్రీడాంశాలకు సంబంధించి జర్నలిస్టులు (చెస్ మినహా) జట్టులవారిగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. గడువులోగా పేర్లు నమోదు చేసుకోని వారికి క్రీడా పోటీలలో పాల్గొనే అవకాశం ఉండదని వారు స్పష్టం చేశారు. పేర్ల నమోదు అనంతరం క్రీడాంశాల వారీగా డ్రాలు తీసి పేర్లను ప్రెస్ క్లబ్ నోటీస్ బోర్డ్ పై అంటించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తామని వారు వివరించారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీజ

అక్షర దర్బార్, ములుగుః ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వాటిని త్వరితగతిన పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందించారు. రెవిన్యూ శాఖ కు సంబంధించినవి (09), ఉద్యోగాలకు సంబంధించినవి (06), పెండింగ్ బిల్లులకు సంబంధించినవి (05), మొత్తం20 దరఖాస్తులను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ, ఆర్డీవో సత్యపాల్ రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాస్ కుమార్, డీఎం అండ్ హెచ్ఓ అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ చంద్ర, డీడబ్లూఓ స్వర్ణలత, ఎల్డీఎం రాజ్ కుమార్, సంక్షేమ శాఖ అధికారి ప్రేమలత ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

అక్షర దర్బార్, మహబూబాబాద్ : పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలని మహబూబాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ నోడల్ అధికారులను ఆదేశించారు. ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, డేవిడ్ తో కలిసి నోడల్ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు, శిక్షణ ఇవ్వాలని సూచించారు. అవసరమైన కంప్యూటర్లు, ప్రింటర్స్, ఇతర సామగ్రి సిద్ధం చేయాలని మెటీరియల్ మేనేజ్మెంట్ నోడల్ అధికారికి సూచించారు.

ఇరాన్ అధ్యక్షుడి మృతి

అక్షర దర్బార్, ఢిల్లీ : హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం చెందారు. ఆయన మృతికి సంతాపంగా ఈ నెల 21న సంతాపదినం పాటించనున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. రైసీ గౌరవార్థం దేశవ్యాప్తంగా జాతీయ జెండాను అవనతం చేయడంతో పాటు అధికారిక వేడుకలకు దూరంగా ఉండాలని కేంద్రం ఆదేశించింది. డ్యాంలు ప్రారంభించి తిరిగి వస్తుండగా అజర్‌బైజాన్ సరిహద్దుల్లోని జోల్ఫాలో కుప్పకూలిన హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడితో పాటు ఆ దేశ విదేశాంగ మంత్రి హోస్సెన్ అమర్ ఉబ్దుల్లాహియాన్ కూడా దుర్మరణం చెందారు. 1989లో ఇరాన్ తొలి సుప్రీంలీడర్ అయతొల్లా రుహోల్లా ఖొమేనీ మరణించిన సమయంలో భారత్ 3 రోజులు సంతాప దినాలు పాటించింది.

విత్తనదుకాణాల్లో తనిఖీలు..

అక్షర దర్బార్, వరంగల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పడ్డాయి. సోమవారం వరంగల్ స్టేషన్ రోడ్ లోని విత్తన దుకాణాల్లో ఇంతేజార్ గంజ్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు కలిసి తనిఖీలు జరిపారు. ఆయా విత్తన దుకాణంలో విత్తన నిల్వలు, అమ్మకాలు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అన్ని విత్తన దుకాణాల్లో కూడా తనిఖీలు జరిపేందుకు పోలీసు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు.